ఆంధ్రజ్యోతి


మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్


పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హరహర మహాదేవ..

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు


మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు శుక్రవారం శివనామస్మరణతో మారుమోగాయి. ఆలయాల్లో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రమైన హుకుంపేట మండలం మత్స్యగుండం మత్స్యలింగేశ్వస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, తదితరులు మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతగిరి మండలం బొర్రా గుహల్లో సహజసిద్ధంగా ఏర్పడిన శివలింగాలకు గిరిజనులు పూజలు నిర్వహించారు. కాశీపట్నం శివాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. పాడేరులో పురాతన శైవక్షేత్రమైన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఉమానీలకంఠేశ్వర స్వామితోపాటు స్వయంభూ లింగేశ్వరస్వామి, త్రిలింగేశ్వరస్వామిలను భక్తులు దర్శించుకున్నారు. కొయ్యూరులో భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


హుకుంపేట మండలం మత్స్యగుండం వద్ద మత్స్యలింగేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

బొర్రా గుహలకు మహర్దశ

కేంద్ర ప్రభుత్వం 'స్వదేశీ దర్శన్'లో రూ.29.88 కోట్లు కేటాయింపు



- అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- పర్యాటకులకు మెరుగుపడనున్న సదుపాయాలు
- మరింత పెరగనున్న సందర్శకులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

లక్షల సంవత్సరాల క్రితం సహజ సిద్ధంగా ఏర్పడి రెండు శతాబ్దాలుగా పర్యాటకాదరణ పొందుతున్న బొర్రా గుహలకు మహర్దశ పట్టింది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'స్వదేశీ దర్శన్' కార్యక్రమంలో బొర్రా గుహలుకు చోటు దక్కింది. రూ.29.88 కోట్లతో బొర్రా గుహల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశీ దర్శన్ కింద దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో బొర్రా గుహలు ఒకటి కావడం విశేషం.

ఆంగ్లేయుల పాలనలో 1807లో బ్రిటీష్ భూగర్భ శాస్త్రవేత్త విలియం కింగ్ కనుగొనే వరకు బొర్రా గ్రామం వద్ద గుహలు వున్నట్టు బాహ్య ప్రపంచానికి తెలియదు. సుమారు 1500 మీటర్ల లోతు ఉన్న బొర్రా గుహలు పైభాగం నుంచి పడే నీటి చుక్కలు కింది భాగంలో స్టాలక్‌లైట్స్‌గా మారి రాతి శిలలుగా ఏర్పడ్డాయి. దీంతో పలు రకాల ఆకృతులు ఏర్పడి సందర్శకుల ఆదరణను పొందుతున్నాయి. సహజ సిద్ధంగా ఏర్పడి, అందమైన ఆకృతులతో చూపరుల మనసు దోచే బొర్రా గుహలను సందర్శించడానికి దేశవిదేశాల నుంచి ఎంతో మంది వస్తుంటారు. అద్భుతమైన ప్రకృతి సంపదను తిలకించే పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. ముఖ్యంగా పర్యాటక సీజన్ అక్టోబరు నుంచి జనవరి వరకు, వేసవి సెలవుల్లో అధికంగా వస్తుంటారు.

మూడు దశాబ్దాల క్రితం వరకు కాడగాలతోనే సందర్శన

మూడు దశాబ్దాల క్రితం వరకు బొర్రా గుహలను కాగడాల వెలుగులోనే సందర్శించాల్సి వచ్చేది. స్థానిక గిరిజన యువకులు గైడ్లుగా వ్యవహరిస్తూ, కాగాడాలు పట్టుకుని పర్యాటకులకు గుహలను చూపించేవారు. తర్వాత ఐటీడీఏ ఆధీనంలోకి తీసుకొని ప్రవేశ రుసుం ద్వారా వచ్చే ఆదాయంలో స్థానికులకు కొంత మొత్తం ఇస్తూ, గుహలను అభివృద్ధి చేసింది. తర్వాత 1992లో పర్యాటక శాఖ ఆధీనంలోకి తీసుకొని 1993లో విద్యుదీకరణ పనులు చేపట్టింది. అనంతరం కాలంలో గుహలలోకి నడిచేందుకు వీలుగా పాత్‌వేలు, మెట్లు, రెయిలింగ్‌లు ఏర్పాటు చేశారు. ఏటా మూడు లక్షల మంది పర్యాటకులు గుహలను సందర్శిస్తున్నారు.

బొర్రా గుహలు (ఫైల్ ఫొటో)


బొర్రా గుహల్లో ఇరుకుగా ఉన్న ప్రదేశం. అభివృద్ధి పనుల్లో భాగంగా ఇక్కడ ప్రత్యామ్నాయ చర్యలు చేపడతారు.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు అంతంతమాత్రం!

బొర్రా గుహల ప్రవేశ రుసుం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కు ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నది. కానీ పెరుగుతున్న పర్యాటకులకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించడంలేదని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని సందర్శకులు అంటున్నారు. గుహల ప్రారంభం వద్ద మెట్లు నిటారుగా, చాలా ఇరుకుగా ఉండడంతోపాటు గుహల్లోకి వెళ్లేవారికి, తిరిగి వచ్చేవారికి ఇదే దారి కావడంతో తీవ్ర అసౌకర్యంగా వుంటున్నది. రద్దీ సమయాల్లో తోపులాట చోటు చేసుకుంటున్నది. ఇక్కడ కూడా సమయం వృథా అవుతున్నది. అదే విధంగా గుహల లోపల రెండుచోట్ల కూడా దారి చాలా ఇరుకుగా వుంది. ఒక్కో మనిషి మాత్రమే వెళ్లగలిగేటంత స్థలం వుండడంతో కొద్దిసేపు లోపలికి వెళ్లేవారు, మరి కొద్దిసేపు బయటకు వచ్చే వారు రాకపోకలు సాగించాల్సి వస్తున్నది. సాధారణ సమయాల్లో గుహలను సందర్శించడానికి గంట సమయం సరిపోతుంది. కానీ పర్యాటక సీజన్‌లో రెండు మూడు గంటలకుపైగా పడుతున్నది. మెట్ల మార్గాన్ని, గుహల్లో ఇరుకువున్న దారిని వెడల్పు చేయాలన్న ప్రతిపాదన కాగితాలపైనే వుంది అదే విధంగా పర్యాటకుల వాహనాలను ... మిగతా 8వ పేజీలో

అరకు ఎంపీ టికెట్ భాగ్యలక్ష్మికి లేనట్టేనా?

సామాజిక సమతూకంపై వైసీపీ అధిష్ఠానం పునరాలోచన

- వాల్మీకి తెగకు ఒక టికెట్ ఇవ్వాలని నిర్ణయం
- పరిశీలనలో నలుగురి పేర్లు
- మాజీ మంత్రి బాలరాజు లేదా ఆయన కుమార్తె, ఎమ్మెల్యే ఫాల్గుణ కోడలు, అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు


భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే


పసుపులేటి బాలరాజు, మాజీ మంత్రి


డాక్టర్ గుమ్మ తనుజారాణి


రోషిణి, అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు

చింతపల్లి, మార్చి 8:

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి రానున్న ఎన్నికల్లో అరకు ఎంపీగా పోటీ చేసే అవకాశం లభించేటట్టులేదు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వైసీపీ అధిష్ఠానం తాజాగా అరకు ఎంపీ టికెట్ వాల్మీకి తెగకు చెందిన వారికి కేటాయించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో భాగంగా వాల్మీకి తెగకు చెందిన ముగ్గురు మహిళలు, ఒక సీనియర్ నేత పేర్లను పరిశీలనలోకి తీసుకున్నట్టు సమాచారం.

వైసీపీ అధిష్ఠానం తొలివిడత జాబితాలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును పాడేరు నియోజకవర్గం సమన్వయకర్తగా, అరకులోయ ఎంపీ జి.మాధవిని అరకు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వకర్తగా నియమించిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల నుంచి వీరే పోటీ చేస్తారని పరోక్షంగా ప్రకటించింది. అయితే అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీ మాధవికి వ్యతిరేకంగా వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపట్టడంతో పార్టీ పెద్దలు పునరాలోచనలో పడ్డారు. ఆమె సామాజిక వర్గానికే (కొండదొర) చెందిన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగంను అరకు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించారు. కాగా పాడేరు నియోజకవర్గం సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త భాగలక్ష్మి.. ఇద్దరు ఒకే సామాజిక వర్గం (భగత) వారు. మన్యంలో మరో ప్రధాన సామాజిక వర్గమైన వాల్మీకిలకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్ కేటాయించకపోవడంతో వచ్చే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని వైసీపీ అధిష్ఠానం భావించింది. దీంతో అరకు ఎంపీ టికెట్‌ను ... మిగతా 8వ పేజీలో

ఆదివాసీల హక్కులు కాలరాస్తున్న వైసీపీ

గిరిజన ప్రత్యేక డీఎస్సీ ప్రకటించకుండా తీవ్రఅన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు లోకనాథం ధ్వజం
- 10న మన్యం బంద్‌కు మద్దతుగా ఆదివాసీ జనరక్షణ దీక్షలు


అప్పలనర్సకు పూలమాల వేసి దీక్షలు ప్రారంభిస్తున్న లోకనాథం

పాడేరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గిన రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం.. ఆదివాసీల హక్కులు, చట్టాలను కాలరాస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం విమర్శించారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న చేపట్టే 'మన్యం బంద్'కు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ఆదివాసీ జనరక్షణ దీక్షలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ... మిగతా 8వ పేజీలో

చేతులు కలిపిన ఉద్దండులు!

దాడి వీరభద్రరావు నివాసానికి కొణతాల రామకృష్ణ

- జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలు
- సుదీర్ఘకాలం రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న దాడి, కొణతాల
- ఒకరు తెలుగుదేశం, మరొకరు కాంగ్రెస్..
- 1999 ఎన్నికల్లో తొలిసారి ముఖాముఖి పోటీ
- దాడి వీరభద్రరావు గెలుపు
- 2004 ఎన్నికల్లో మరోసారి తలపడిన దిగ్గజాలు
- ఈసారి కొణతాలను వరించిన విజయం
- 2014లో ఇద్దరూ వైసీపీలోకి..
- కొంతకాలం తరువాత బయటకు వచ్చిన నేతలు
- ఇటీవల టీడీపీ గూటికి వీరభద్రరావు, జనసేన పార్టీలో చేరిన రామకృష్ణ...
- వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ


టీడీపీ, జనసేన నాయకులతో కొణతాల రామకృష్ణ, దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, మార్చి 8:

వారిద్దరూ చిరకాలంగా రాజకీయ ప్రత్యర్థులు. ఒకరు టీడీపీలో, మరొకరు కాంగ్రెస్‌లో దశాబ్దాలపాటు కొనసాగారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరూ వైసీపీలోకి వెళ్లారు. అందులో నుంచి బయటకు వచ్చారు. ఒకరు జనసేనలో, మరొకరు తెలుగుదేశం పార్టీలో చేరారు. రెండు పార్టీల మధ్య పొత్తు కుదరడంతో వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు చేతులు కలిపారు. దీంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి.

అనకాపల్లికి చెందిన దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ ఉత్తరాంధ్రలో సీనియర్ రాజకీయ నాయకులు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున దాడి వీరభద్రరావు ఎమ్మెల్యేగా ఎన్నికైతే, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ గెలుపొందారు. ఇందులో 1999లో కొణతాలపై దాడి వీరభద్రరావు గెలుపొందగా, 2004లో దాడిపై కొణతాల విజయం సాధించారు. 2009లో ముక్కోణ పోటీలో దాడి (టీడీపీ), కొణతాల (కాంగ్రెస్)పై ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు గెలుపొందారు. అయితే ఒకానొక సందర్భంలో దాడి, కొణతాల వేర్వేరుగా వైసీపీలోకి వెళ్లారు. 2014 ఎన్నికల అనంతరం వైసీపీ నుంచి కొణతాల బయటకు వచ్చేశారు. అప్పటినుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన ఇటీవల జనసేనలో చేరారు. ఇదిలావుండగా గతంలో ఒకసారి వైసీపీ నుంచి బయటకు వచ్చి..మళ్లీ అందులో చేరిన దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు రెండు నెలల క్రితం ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. కాగా, పొత్తులో భాగంగా అనకాపల్లి సీటు తీసుకున్న జనసేన తమ అభ్యర్థిగా కొణతాల రామకృష్ణను ప్రకటించింది. ఆయన గత పది రోజులుగా నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతలను కలుస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అనకాపల్లి సంతబయలు ప్రాంతంలో గల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసానికి వెళ్లారు. ఎన్నికల్లో తనకు సహకరించాల్సిందిగా కోరారు.

ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ తమ రెండు కుటుంబాల మధ్య రాజకీయాలకు ముందు అవినాభావ సంబంధాలు ఉండేవన్నారు. రాజకీయపరమైన విభేదాలే తప్ప వ్యక్తిగత సమస్యలు ఏమీ లేవన్నారు. కొణతాల తండ్రి సుబ్రహ్మణ్యంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. అనకాపల్లి టికెట్‌ను కొణతాలకు కేటాయించడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు తామంతా కలిసి పనిచేస్తామని దాడి వీరభద్రరావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసిపనిచేయాలని పిలుపునిచ్చారు. అందరూ పనిచేయాలన్నారు. ఎన్నికల్లో డబ్బుతో గెలుపొందాలని వైసీపీ భావిస్తుందన్నారు. అనకాపల్లిలో నాయకులు ఎవరూ లేనట్టు అమెరికా నుంచి తీసుకువచ్చి పోటీకి నిలిపిందని విమర్శించారు. నియోజకవర్గం లేని వ్యక్తి ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తామనడం ... మిగతా 8వ పేజీలో


ప్రమాదంలో మృతిచెందిన యువకుడు

ఘోరం

అరకులోయ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురి మృతి
- మరో ఐదుగురికి తీవ్రగాయాలు

అరకులోయ మండలం నందివలస వద్ద శుక్రవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా, మరో ఐదుగురు అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

..... వివరాలు మెయిన్ 3లో

క్రైం... crime news

నర్సీపట్నంలో వివాహిత ఆత్మహత్య

నర్సీపట్నం, మార్చి 8: మునిసిపాలిటీలోని ఒకటో వార్డు పరిధి పీనారి పాలెంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు పట్టణ సీఐ కాంతికుమార్ తెలిపారు. గొల్లి పూర్ణచంద్రిక సాయి శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. అయితే ఇందుకు గల కారణాలు తెలియ రాలేదన్నారు. ఈ సంఘటనపై మృతిరాలి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సముద్రంలో మునిగి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, మార్చి 8: మండలంలోని రేవుపోలవరం వద్ద సముద్రంలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు శుక్రవారం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. రేవుపోలవరం సముద్రతీరం వద్ద ఓ వ్యక్తి మృతి చెందినట్టు అందిన సమాచారం మేరకు పరిశీలించగా.. పాయకరావుపేటకు చెందిన నూకాల మనీష్ (29) గా గుర్తించామన్నారు. మనీష్ శుక్రవారం మధ్యాహ్నం రేవుపోలవరం సముద్రతీరం వద్దకు వచ్చాడన్నారు. వంటిపై బట్టలుతీయకుండా మనీష్ మృతి చెంది ఉండడంపై ప్రమాదవశాత్తు సముద్రంలో కాలు జారి మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు. మృతుడు మనీష్‌కి వివాహం కాలేదని, సివిల్ ఇంజనీరింగ్ చేశాడని, పాయకరావుపేటలో కాంట్రాక్టర్ వర్క్ చేస్తుంటాడని ఎస్ఐ తెలిపారు.

బస్టాప్‌లో దివ్యాంగుడు...

అనకాపల్లి టౌన్, మార్చి 8: స్థానిక నెహ్రూచౌక్ బస్టాప్‌లో దివ్యాంగుడు గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. కశింకోట మండలం అడ్డాం గ్రామానికి చెందిన చేకూరి వెంకట సూర్యనారాయణరాజు(40) కాలు పోగొట్టుకున్నాడని, ఆయన అనకాపల్లిలోనే కాలం వెళ్లదీస్తున్నాడన్నారు. అయితే బస్టాప్‌లో అపస్మారక స్థితిలో ఉన్న సూర్యనారాయణరాజును స్థానికులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా మృతి చెందినట్టు వైద్యాలయం నుంచి సమాచారం వచ్చిందని ఎస్ఐ తెలిపారు. మృతుడు వద్ద ఉన్న సంచిని పరిశీలించగా.. అందులో వలంటీర్ నంబరు లభించడంతో ఆమె ద్వారా కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నామన్నారు. మృతుడు భార్య కృష్ణవేణి పద్మనాభం మండలం చిన్నాపురంలో ఉన్నట్టు నిర్ధారించుకుని వారికి సమాచారం ఇచ్చామన్నారు. శుక్రవారం వారు ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చారన్నారు. భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.

డ్రైవింగ్ చేస్తూ గుండెపోటుతో మరొకరు..


మక్కపాటి బాపారావు (ఫైల్‌ఫొటో)

లంకెలపాలెం, మార్చి 8: కారు డ్రైవింగ్ చేస్తూ గుండెపోటుతో ఒకరు మృతి చెందారు. లంకెలపాలెం కూడలిలో శుక్రవారం సాయంత్ర ఈసంఘటన చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా జయప్రకాశ్‌నగర్‌కు చెందిన మక్కపాటి బాపారావు (55) పరవాడ మండలం కన్నూరులో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. సబ్బవరం సమీపంలో సీలింగ్ సీట్లు తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. బాపారావు తన ఇంటి నుంచి సాయంత్రం కారులో బయలుదేరాడు. లంకెలపాలెం సిగ్నల్ కూడలికి కూత వేటు దూరంలో వచ్చేసిరికి ఆయన గుండె నొప్పి రావడంతో కారును పక్కకు నిలిపి వేసి డ్రైవింగ్ సీటులోనే కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసుల సాయంతో కారు అద్దాలు తీసి చూసేసరికి ఆయన మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాపారావుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మార్చి 8: మండలంలోని మోసయ్యపేటలో గోని సంచితో తరలిస్తున్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మోసయ్యపేటలో సాధారణ తనిఖీలు చేస్తుండగా గ్రామానికి చెందిన దుద్దేటి చినరమణ పోలీసులను చూసి గోనెసంచితో పారిపోతుండగా అనుమానం వచ్చి పట్టుకొని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు చినరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్‌బాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం


కృష్ణ (ఫైల్ ఫొటో)

చింతపల్లి, మార్చి 8: ప్రకాశం జిల్లా గొండుపాలెం జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతపల్లికి చెందిన ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో అల్పాహార దుకాణం నిర్వహిస్తున్న కంచర్ల కృష్ణ (42) రెండు రోజుల క్రితం కారులో డ్రైవర్ అంకాబత్తుల స్వామితో కలిసి శ్రీశైలం దర్శనానికి వెళ్లాడు. దర్శనం పూర్తి చేసుకుని గురువారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం ఉదయం డ్రైవర్ వెనుక సీటులో కూర్చొని నిద్రపోతుండగా కృష్ణ డ్రైవింగ్ చేస్తున్నాడు. 7 గంటల సమయంలో ప్రకాశం జిల్లా గొండుపాలెం వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన కృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్ స్వామి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారి కృష్ణ మృతికి వర్తకం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, బేతాళుడు సంతాపం వ్యక్తం చేశారు.

పూర్తిగా మహిళా సిబ్బందితో విశాఖ-భవానీపట్న పాసింజర్



మహిళా సిబ్బందితో వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖపట్నం నుంచి భవానీపట్న పాసింజర్ రైలును (08504) పూర్తిగా మహిళా సిబ్బందితో నడిపించారు. స్టేషన్ మేనేజర్ ఎ.అరుణశ్రీ నాయకత్వంలో లోకోపైలట్‌గా ఝాన్సీరాణి, కో-పైలట్‌గా సాధనకుమారి, రైలు మేనేజర్‌గా (గార్డు) కె.శ్రీరమ్య విధులు నిర్వహించారు. కాగా ఈ రైలుకు చెందిన అన్ని బోగీల నిర్వహణను డిపోలో మహిళా సిబ్బంది చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ తన కార్యవర్గ సభ్యులతో స్టేషన్‌కు చేరుకుని పాసింజర్‌లో విధులు నిర్వహించిన మహిళా సిబ్బందిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు మధుస్మిత సాహు, కవితా గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

కల్యాణపులోవలో కోలాహలం


రిజర్వాయర్ వద్ద భక్తులు (పెద్ద ఫొటో)




ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) పోతురాజుబాబును దర్శించుకుంటున్న భక్తులు

తిరునాళ్లకు తరలి వచ్చిన భక్తజనం

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయం పరిసరాలు
- తొలుత రిజర్వాయర్‌లో పవిత్ర స్నానాలు
- అనంతరం పోతురాజుబాబు, పెద్దింటమ్మలకు పూజలు
- గత ఏడాది కంటే సగానికి తగ్గిన భక్తజనం

రావికమతం, మార్చి 8: ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న వేడుకల్లో ఒకటైన రావికమతం మండలంలోని కల్యాణపులోవ తిరునాళ్లు శుక్రవారం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగిన ఈ వేడులకు విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా రిజర్వాయర్, ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగాయి. రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలు జనసందోహంతో కనిపించాయి. తొలిరోజు సుమారు లక్ష మంది వరకు భక్తులు వస్తారని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కాగా 50 వేల మంది మాత్రమే విచ్చేసినట్టు సదరు అధికారులు అంచనా వేస్తున్నారు. పుణ్యస్నానాల అనంతరం భక్తులు పోతురాజుబాబు,పెద్దింటమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేసినప్పటికీ రాను రాను భక్తుల తాకిడి పెరగడంతో చాలామంది ఎండలో నిలవలేక దర్శనాలకు ఇబ్బందులుపడ్డారు. వైసీపీ నాయకులు కంచిపాటి జగన్నాథరావు, ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, చీమలపాడు సర్పంచ్ వంజరి గంగరాజు తదితరులతో పాటు అన్ని శాఖల అధికారులు అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంతో భక్తులు తొక్కిసలాటకు గురయ్యారు. స్నానాలరేవు వద్ద మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీల వైద్యాధికారులు దుర్గాప్రసాద్, రజని ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ పోలీసులు బందో బస్తు నిర్వహించారు. జెడ్.కొత్తపట్నం వద్ద ఆ గ్రామ సర్పంచ్ వితంశెట్టి సురేష్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గాలి జగదీష్‌ల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. నర్సీపట్నం నుంచి ఆర్టీసీ తొలిరోజు 40 బస్సులను నడిపింది. ఆటోలు , కార్లను ట్రాఫిక్ దృష్ట్యా పోలీసులు దొండపూడి రాణా వద్దే నిలిపివేశారు. భక్తులను ఆర్టీసీ బస్సుల్లో కల్యాణపులోవకు వెళ్లేందుకు అవకాశం కల్పించారు.


దంపతులతో పూజ చేయిస్తున్న పురోహితులు


దర్శనాల కోసం మండుటెండలో క్యూలో ఉన్న భక్తులు

మహిళా హక్కులు కాపాడుకుందాం

- ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల

పాయకరావుపేట, మార్చి 8: పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను కాపాడుకుందామని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరాకాలనీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో విమల సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్నటువంటి మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారని వాపోయారు. మహిళలంతా సంఘటితమై పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మద్యాన్ని నిషేధిస్తామని పొందుపరచాలని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే చట్టసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బందుల సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.పరమేశ్వరి, రమణమ్మ, మహిళలు పాల్గొన్నారు.


ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

● బ్యూటిఫుల్ బటర్‌ఫ్లై



సీతాకోక చిలుక.. వర్ణనకు అందని అందం దీని సొంతం. ఆకులపై వాలినా.. గాలిలో విహరిస్తూ అగుపించినా.. నయనానందకరం. ఇటువంటి జీవి కొంగొత్తగా చోడవరం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల ఓ ఉపాధ్యాయిని ఇంట శుక్రవారం కనిపించింది. మిలటరీ సైనికులు ధరించే దుస్తుల రంగుల్లో ఉన్న దీనిని చూసిన వారంతా మంత్రముగ్ధులయ్యారు. ఈ మనోహరాన్ని కొందరు సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించి తెగ సంబరపడ్డారు.

- చోడవరం

అంబేడ్కర్‌ను అవమానపరిచారు

- శిలాఫలకంపై మరణించిన తేదీని తప్పుగా ముద్రించారు
- మునిసిపల్ వైస్ చైర్మన్ రామకృష్ణ, ఎమ్మెల్యే గణేశ్‌పై ఫిర్యాదు
- అట్రాసిటీ కేసు నమోదుకు దళిత నాయకులు డిమాండ్

నర్సీపట్నం, మార్చి 8: శిలాఫలకంపై అంబేడ్కర్ మరణించిన తేదీని తప్పుగా ముద్రించి, అవమాన పరిచిన నర్సీపట్నం మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, విగ్రహదాత ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక దళిత నాయకుడు నేతల నాగేశ్వరరావుతో కలిసి గురువారం రాత్రి పట్టణ సీఐ కాంతికుమార్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 24వ తేదీన వేంకటేశ్వరస్వామి గుడి నుంచి పెదబొడ్డేపల్లి సబ్ స్టేషన్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన దేశనాయకుల విగ్రహాలలో అంబేడ్కర్ విగ్రహం శిలాఫలకంపై ఆయన మరణించిన తేదీని తప్పుగా ముద్రించి అవమానపరిచారని ఆరోపించారు. అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14లో జన్మించారని, 1956 డిసెంబరు 6న మరణించారని, అయితే శిలాఫలకంపై 1902లో మరణించినట్టు తప్పుగా ముద్రించి భారత రాజ్యాంగ నిర్మాతను తీవ్రంగా అవమాన పరిచారని వాపోయారు. ఇందుకు సంబంధించి వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎమ్మెల్యే గణేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.


సీఐకు ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

'విజన్ విశాఖ' నేతల కోసమేనా?

- సీఎంకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ
- ప్రజల సమస్యలపై అవగాహన లేని ప్రైవేటు కన్సల్టెంట్‌తో తయారు చేయించిన డాక్యుమెంటులా ఉందని విమర్శ

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల 'విజన్ విశాఖ' పేరుతో ప్రకటించిన ప్రణాళిక ప్రజల కోసమా?, ప్రభుత్వాన్ని నడిపే నేతల కోసమా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ శుక్రవారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. ఆ ప్రణాళిక, అందులోని హంగులతో కూడిన అంశాలను పరిశీలిస్తే ప్రజల సమస్యలపై అవగాహన లేని ప్రైవేటు కన్సల్టెంట్‌తో తయారు చేయించిన డాక్యుమెంటులా ఉందని విమర్శించారు. ఆ కన్సల్టెంట్‌కు భారీగానే ముట్టజెప్పి ఉంటారని, దానికి బదులు ఆ నిధులతో విశాఖ ప్రజల అభిప్రాయాలు తీసుకొని, వారి సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళిక తయారుచేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. విశాఖపట్నం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమైన మూడు అంశాలు (వ్యవసాయం, పాడి పరిశ్రమ, తీర ప్రాంతంలో సంప్రదాయ మత్స్య పరిశ్రమ)పై దృష్టి పెట్టాల్సి ఉందని, వాటిని విసర్జించి విజన్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మించడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో ఏడు లక్షల మంది మురికివాడల ప్రజలు ఉన్నారని, వారికి కనీస వసతులు కల్పించాలనే ప్రయత్నం విజన్‌లో ఎక్కడా కనిపించలేదన్నారు. తీర ప్రాంతాన్ని పరిశ్రమలతో కాలుష్యమయం చేస్తున్నారని, మత్స్యకారులకు జీవనోపాధి కరవవుతోందన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో మత్స్యకారులను నిర్వాసితులను చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ పరిసరాల్లో పాడి పరిశ్రమపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు బతుకుతున్నాయని, వారిని కూడా పట్టించుకోలేదన్నారు. విశాఖను అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గుర్తించిందని, దానికి పరిష్కారం ఏమీ చూపించలేదన్నారు. విశాఖలో ఐకానిక్ భవనాలు నిర్మిస్తే రియల్ ఎస్టేట్ రంగం, భూకబ్జాదారులకు మాత్రమే లాభం కలుగుతుందని, ఆస్తిపన్నులు పెరిగిపోయి సామాన్యులు చితికిపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా, ప్రకృతి వనరులను నాశనం చేస్తూ, అధికార పార్టీ నేతలకు మేలు చేసేలా రూపొందించిన ప్రణాళికను అమలు చేయడం తగదని సూచించారు.

సమస్యలపై మహిళల డోలీమోతతో నిరసన

రోలుగుంట, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదగరువులో ఆదివాసీ మహిళలు డోలీ మోతతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏళ్లు గడుస్తున్నా తమ గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని వాపోయారు. అత్యవసర వైద్య సేవలు అందాలన్నా డోలీమోత ద్వారా ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సిన దౌర్భాగ్య స్థితిని ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. కనీసం రోడ్డు సౌకర్యం లేదని, తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పిల్లలు చదువుకోవడానికి పాఠశాల లేకపోవడం విచిత్రకరమన్నారు. ఎన్నికల సమయాల్లో నాయకులు వచ్చి ఓట్ల కోసం హామీలు ఇవ్వడమే తప్పితే కార్యరూపం దాల్చడం లేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను గుర్తించాల్సిందిగా కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కిల్లో నరసమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డోలీమోతతో నిరసన తెలుపుతున్న ఆదివాసీ మహిళలు

నకిలీ పోలీస్ దందా

- రైల్వేలో ఉద్యోగాల పేరిట రూ.కోట్లు వసూలు
- నకిలీ నియామక పత్రాలు అందజేత
- మోసపోయామని గుర్తించి పోలీస్ కమిషనర్‌ను కలిసిన బాధితులు
- నిందుతుడిని, అతడికి సహకరించిన యువతిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న నగర టాస్క్‌ఫోర్స్


పోలీస్ డ్రెస్‌లో ఉన్న రమేశ్‌కుమార్


రమేశ్‌కుమార్ స్నేహితురాలు శ్రావణి

పెందుర్తి, మార్చి 8: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు వసూలుచేసిన నకిలీ ఎస్ఐను, అతడి స్నేహితురాలిని నగర పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం శేఖరపురం గ్రామానికి చెందిన హనుమంతు రమేశ్‌కుమార్ (39), అదే ప్రాంతానికి చెందిన సరితకు 2012లో వివాహం అయ్యింది. వీరికి పాప, బాబు ఉన్నారు. తాను సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్టు రమేశ్‌కుమార్ చెప్పాడు. వరంగల్‌లో పోస్టింగ్ అని చెప్పి శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గలో కాపురం పెట్టాడు. ఆరు నెలలకు ఓసారి ఇంటికి వచ్చి కొద్దిరోజులు ఉండి వెళుతుండేవాడు. ఈ క్రమంలో తనకు మణిపూర్, జమ్మూ కశ్మీర్...ఇలా పలు ప్రాంతాలకు బదిలీ అయ్యిందని భార్య సరితకు చెబుతుండేవాడు. పిల్లల చదువుల కోసం సరిత కాశీబుగ్గ నుంచి రెండు సంవత్సరాల క్రితం పెందుర్తి సమీపంలోని దుర్గానగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుంది.

టూ టౌన్ ఎస్ఐనంటూ..

పెందుర్తి రాకపోకలు సాగించే క్రమంలో స్థానికులతో రమేశ్‌కుమార్ పరిచయం పెంచుకున్నాడు. విశాఖలో టూ టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్నానని, డిపార్టుమెంట్‌లో ఉన్నత వ్యక్తులతో తనకు పరిచయం ఉందని చెప్పేవాడు. పోలీసు యూనిఫామ్‌తో తిరుగుతుండడంతో స్థానికులు నిజమేననుకున్నారు. అతని ఇంటి ఎదురుగా పెయింటింగ్ పనులు చేసే దుంపల కృష్ణారావు ఉంటున్నారు. కృష్ణారావు కుమారుడికి పోలీసు శాఖలో ఉద్యోగం వేయిస్తానని రమేశ్‌కుమార్ నమ్మబలికాడు. ఆ తరువాత తన భార్య సరిత మేనమామ సికింద్రాబాద్ రైల్వేలో డీఆర్ఎంగా పనిచేసి రిటైర్ అవుతున్నారని రైల్వేలో ఉద్యోగాలు సెట్ చేసుకోవచ్చునని చెప్పాడు. పోలీసు ఉద్యోగాల్లో లా అండ్ ఆర్డర్ సమస్య ఉందని రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. రూ.8 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. ఇది నిజమేనని నమ్మి దుంపల కృష్ణారావుతో పాటు అతని బంధువులు మరో 12 మంది దఫదఫాలుగా సుమారు రూ.కోటి దాకా ముట్టజెప్పారు.

ఫేక్ మెయిల్స్

రైల్వేలో ఉద్యోగాలు కోసం ఎంపికయ్యారని నకిలీ పత్రాలు, ఫేక్ మెయిల్స్ పంపాడు. అయితే ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చి నిలదీయడంతో రైల్వే ఉద్యోగ నియామక పరీక్ష ఉందని అందరినీ విజయవాడ రమ్మన్నాడు. అక్కడ గల ఓ లాడ్జిలో శ్రావణి అనే యువతిని పరిచయం చేసి ఆమె రైల్వే డీఆర్ఎం పీఏ అని చెప్పాడు. లాడ్జిలోనే పరీక్ష కండక్ట్ చేశారు. అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చేశాడు. కొన్ని నెలలు తరవాత సికింద్రాబాద్‌లో చేరాల్సి ఉంటుందని చెప్పి..ఆ 12 మంది దగ్గర మిగిలిన మొత్తాన్ని వసూలుచేశాడు. అనంతరం వారందరినీ ఓరోజు సికింద్రాబాద్ రమ్మని అక్కడ గల ఓ హోటల్‌లో ఉంచాడు. హోటల్‌లో ఉంటూ అతనికి ఫోన్ చేస్తే ఏవేవో సాకులు చెబుతూ తప్పించుకునేవాడు. దీంతో వారంతా అనుమానం వచ్చి సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లి ఆ అపాయింట్‌మెంట్ పత్రాలు చూపించగా నకిలీవని తేల్చారు. దీంతో తాము మోసపోయామని గ్రహించారు. ఇదే సమయంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన కొంతమంది పెందుర్తిలో గల రమేశ్‌కుమార్ ఇంటికి రావడాన్ని బాధితుడు కృష్ణారావు గమనించాడు. అందరూ కలసి రమేశ్‌కుమార్ స్వగ్రామానికి వెళ్లి అతని తల్లిదండ్రులను కలిసి నిలదీయగా అతను ఎస్ఐ కాదని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న రమేశ్‌కుమార్, శ్రావణి ఒకరోజు పోలీస్ యూనిఫారంలో కృష్ణారావు ఇంటికి వెళ్లారు. అతడి తల దగ్గర తుపాకీ పెట్టి చంపేస్తానని బెదిరించి, జేబులోని రూ.10 వేలు తీసుకుని పరారయ్యారు. బాధితుల్లో కొంతమంది సీపీని ఆశ్రయించడంతో టాస్క్‌ఫోర్సు బృందాలు హైదారాబాద్‌లో రమేశ్‌కుమార్‌ను, శ్రావణిని అదుపులోకి తీసుకున్నాయి. వారి నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్టు తెలిసింది. అయితే బాధితుడు కృష్ణారావు ఫిర్యాదు మేరకు రమేశ్‌కుమార్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని సీఐ ఎల్.రామకృష్ణ చెప్పారు. రమేశ్‌కుమార్, శ్రావణి నకిలీ పోలీసుల అవతారంలో పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.3 కోట్లు వరకూ వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా తన భర్త రమేశ్‌కుమార్ కనిపించడం లేదని సరిత జనవరి ఒకటో తేదీన పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి స్పెషల్ టీం డ్యూటీకని వెళ్లి ఇంటికి రాలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం



అరకులోయ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మత్స్యగుండం మత్స్యలింగేశ్వరస్వామి జాతరకు భారీగా తరలివచ్చిన భక్తజనం

మన్యంలో వైభవంగా మహా శివరాత్రి ఉత్సవాలు

శివ నామస్మరణతో మార్మోగిన శివాలయాలు

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు.. రాత్రి జాగారాలు

పాడేరు రూరల్, మార్చి 8: మన్యంలోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగిపోయాయి. వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో వైభవోపేతంగా మహాశివరాత్రి వేడుకలను నిర్వహించారు. జిల్లా కేంద్రం పాడేరులోని పురాతన శైవక్షేత్రమైన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతుల చేతుల మీదుగా ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు శివసన్నిధిలో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. కైలాస గౌరీ నోము చేపట్టిన దంపతులు ఆలయానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, వాయిలాలు ఇచ్చారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉమానీలకంఠేశ్వర స్వామి, స్వయంభూ లింగేశ్వరస్వామి, త్రిలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు వంతాడపల్లి ఇరడాపల్లి, మినుములూరు, సూకురుపుట్టు, డోకులూరు తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని సన్నిధిలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, టీడీపీ నాయకులు కె.సుబ్బారావు, ఉపసర్పంచ్ బి.రామునాయుడు, వైస్ ఎంపీపీ జి.శివకుమార్, ఆధ్యాత్మిక సేవా బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రాగుహల్లో సహజసిద్ధంగా ఏర్పడిన శివమూర్తులకు పర్యాటకులు, స్థానిక భక్తులు దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. అలాగే అరకులోయ, యండపల్లివలస, నందివలస, డింగ్రిపుట్, ఎం.హట్టగుడ, సుంకరమెట్ట శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అరకు శివాలయంలో మధ్యాహ్నం అన్నసమరాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చింతపల్లిలో...

చింతపల్లి: మండల కేంద్రంలోని అంతర్ల అనాదీశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు శివ మాతాజి ఆధ్వర్యంలో వేదపండితులు అభిషేకాలు, కుంకుమ పూజలు, ప్రత్యేక హోమం నిర్వహించారు. చింతపల్లి, జీకే వీధి మండలాలతో పాటు మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల కోసం నిర్వాహకులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయంలో శనివారం శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో జీకే వీధి, చింతపల్లి ఎంపీపీలు కుమారి, అనుషదేవి, వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, వైసీపీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ సీఐలు అశోక్‌కుమార్, కె.రమేశ్, ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.



డుంబ్రిగుడ మండలం కురిడి శివాలయంలో బారులు తీరిన భక్తులు

కొయ్యూరులో...

కొయ్యూరు: మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాలకు భక్తుల తాకిడి పెరిగింది. కొయ్యూరు మల్లికార్జునస్వామి దేవాలయంలో వెలసిన భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణానికి వంశపారంపర్య ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్ పట్టు వస్త్రాలు సమర్పించారు. పి.మాకవరం పురాతన శివాలయం భక్తులు బారులు తీరారు. సమీప ఉత్తరవాహినిగా పేరుగాంచిన కొండవాగు ప్రవాహంలో పుణ్య స్నానాలకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవాల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీఐ వెంకటరమణ, కొయ్యూరు, మంప ఎస్ఐలు రామకృష్ణ, లోకేష్‌కుమార్, దేముడు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు.



కొయ్యూరు మల్లికార్జునస్వామి దేవాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలంలోని శివలయాలు కిటకిటలాడాయి. జి.మాడుగుల-పెదబయలు సరిహద్దులోని ఎర్రబయలు, సంతబయలు, రాళ్లపుట్టు బందవీధితో పాటు పలు దేవాలయాల్లో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ రమేశ్ పర్యవేక్షణలో తగిన చర్యలు చేపట్టారు.



సీలేరు శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సీలేరులో...

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు, ధారకొండల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ధారకొండలో ఐదు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సీలేరు, ధారకొండ శివాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలో శివరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కురిడిలోని మల్లికార్జునస్వామి, డుంబ్రిగుడలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మత్స్యగుండంలో కన్నులపండువగా జాతర

హుకుంపేట: మత్స్యగుండం మత్స్యలింగేశ్వస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి జాతర కన్నులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్ తదితరులు మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి వైద్యులకు సూచనలు ఇచ్చారు. అలాగే బందోబస్తు చర్యలను ఎస్పీ తుహిన్ సిన్హా సమీక్షించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను సత్కరించారు. ఎంపీడీవో వెంకటరావు, సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ సతీష్, ఉత్స కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

ఆడ బిడ్డల కోసం కొత్త పథకం

- మహిళా సాధికారతకు టీడీపీ-జనసేన అధినేతల ముందడుగు
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, మార్చి 8: రాష్ట్రంలో ఆడ బిడ్డల కోసం టీడీపీ-జనసేన అధినేతలు కొత్త పథకాన్ని ప్రకటించారని, తద్వారా మహిళా సాధికారతకు ముందడుగు వేశారని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తెలిపారు. శుక్రవారం తన నివాస గృహంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ డబ్బుల కొరతతో ఇబ్బందులకు గురై విద్యకు దూరమై ఇంటికి పరిమితం కాకూడదన్న దృక్పథంతో 'కలలకు రెక్కలు' అనే పేరుతో సరికొత్త పథకాన్ని తీసుకు వస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పిండం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటర్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకంలో దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులన్నారు. ఆడబిడ్డల కలలు నెరవేర్చేందుకు ఈ పథకం దోహద పడుతుందన్నారు. పథకంలో పేరు నమోదు చేసుకున్న మహిళలు బ్యాంకుల్లో తీసుకునే రుణాలకు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. విద్య కోసం మహిళలు తీసుకొనే రుణాలకు వడ్డీలను ఉమ్మడి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. అర్హత గల మహిళలు దేశంలో ఎక్కడైనా తమకు నచ్చిన ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసించవచ్చని ఆమె వివరించారు. ఆసక్తి గల మహిళలు కలలకు రెక్కలు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికెట్ పొందవచ్చని ఆమె తెలిపారు. 2024 జూన్‌లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రిజిస్ట్రేషన్ చేయించుకున్న మహిళలు తమ సమీపంలోని బ్యాంకులకు వెళ్లి, తరువాత ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని వివరించారు. రిజిస్ట్రేషన్ లింక్ పొందేందుకు 9261292612 నంబర్‌కు మిస్‌కాల్ ఇస్తే సరిపోతుందని ఆమె స్పష్టం చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మహిళలను సన్మానించిన దృశ్యం...



డుంబ్రిగుడ మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులు

పాడేరు రూరల్, మార్చి 8: మన్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాడేరులోని గిరిజన ఉద్యోగుల భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ మహిళలు చక్కగా చదువుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను నియంత్రించేందుకు మహిళా అధికారులు, విద్యావంతులైన మహిళలు కృషి చేయాలని కోరారు. అనంతరం గిడ్డి ఈశ్వరితో పాటు 50 మంది మహిళా ఉద్యోగులను గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, డీఆర్‌వో దేవీ రాజేశ్వరి తదితరులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆర్.జగన్మోహన్‌రావు, కె.ధనుర్జయ్, ఎ.శ్యాంసుందర్, కె.పోతురాజు, సుశీల, బాబూరావు, బొంజుబాబు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పీటీడీ డిపోలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు ఎల్వీకుమారి, టి.అన్నపూర్ణ, ఎం.పూర్ణమ్మ, ఎస్.మణి, ఎస్టీ భారతిలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్ శ్యామ్‌సుందరనాయుడు, ఆఫీస్ సూపరింటెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీడీవో జయఉమా, మహిళా ప్రజా ప్రతినిధులు కేక్ కట్ చేశారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే అభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. సర్పంచ్ శారద, ఎంపీటీసీ సభ్యురాలు వరహాలమ్మ, మండల మహిళ అధ్యక్షురాలు శాంతి, జిల్లా కమిటీ సభ్యురాలు లీలారాణి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని మండల పరిధిలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు శాలువాలతో సన్మానాలను చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గాజులబంద గ్రామంలో మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మిఠాయిలను అందించారు.

జాబ్ కార్డు లేక పక్కా గృహాలకు దూరం

- చీపురుగొంది ఆదివాసీ కుటుంబాల దైన్యం
- అధికారులకు దరఖాస్తులు ఇచ్చినా పట్టని వైనం



గ్రామంలో నిరసన తెలుపుతున్న చీపురుగొంది పీవీటీజీలు

గూడెంకొత్తవీధి, మార్చి 8: మండల కేంద్రంలోని చీపురుగొంది గ్రామంలోని జాబ్ కార్డు లేక ఆదివాసీలు పక్కా గృహాలను కోల్పోయారు. సుమారు 30 ఆదివాసీ కుటుంబాలు సుమారు 60 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 15 మందికి జాబ్ కార్డులు ఉండడంతో జన్‌మన్ పథకంలో భాగంగా పక్కా గృహాలు మంజూరయ్యాయి. మరో 15 మందికి ఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డులు లేవని అధికారులు పక్కా గృహాలకు అనర్హులుగా ప్రకటించారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన నిరుపేద ఆదివాసీలను అనర్హులుగా ప్రకటించడంపై పీవీటీజీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాబ్ కార్డుల కోసం పలుమార్లు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పటి వరకు కార్డులు పంపిణీ చేయకపోగా పనులు కూడా కల్పించడంలేదని బాధిత ఆదివాసీలు శుక్రవారం నిరసన తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి జాబ్ కార్డులను అందించి పక్కా గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అరకు ఎంపీ టికెట్ భాగ్యలక్ష్మికి లేనట్టేనా?

... 5వ పేజీ తరువాయి

వాల్మీకి తెగ వారికి కేటాయించాలని నిర్ణయించినట్టు సమాచారం.

పరిశీలనలో నలుగురి పేర్లు..

అరకు ఎంపీ స్థానానికి వైసీపీ అధిష్ఠానం వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నలుగురి పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలిసింది. అరకులోయ సిట్టింగ్ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ కోడలు డాక్టర్ గుమ్మ తనుజారాణి, చింతపల్లి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు లేదా ఆయన కుమార్తె డాక్టర్ దర్శిని, అరకలోయ జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి పేర్లు తెరపైకి వచ్చాయి. డాక్టర్ తనుజారాణి ప్రస్తుతం కాంట్రాక్టు వైద్యురాలుగా పనిచేస్తున్నారు. ఆమె తండ్రి అడ్డుమండ పంచాయతీ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీకి తనకు అవకాశం ఇవ్వనందున తన కోడలు తనుజారాణికి ఎంపీ టికెట్ ఇవ్వాలని చెట్టి ఫాల్గుణ వైసీపీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పేరు కూడా పరిశీలనలో వున్నట్టు చెబుతున్నారు. గతంలో చాలాకాలంపాటు కాంగ్రెస్ పార్టీలో వున్న ఆయన.. తరువాత జనసేన పార్టీలో చేరారు. అయితే కొంతకాలం క్రితం వైసీపీ కండువా కప్పుకున్నారు. గతంలో మంత్రిగా కూడా పనిచేసి వుండడంతో పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలకు సుపరిచితుడేనని, పైగా ప్రధాన తెగల్లో ఒకటైన వాల్మీకి తెగకు చెందిన వ్యక్తి కావడంతో వైసీపీ అధిష్ఠానం బాలరాజు వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది. వాస్తవంగా ఆయన కుమార్తె డాక్టర్ దర్శిని (ఎంఎస్ పూర్తి చేసి ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలుగా పనిచేస్తున్నారు) పేరు పరిశీలనకు వచ్చింది. అయితే తల్లిదండ్రులు కులాల వేర్వేరు కావడంతో సందిగ్ధంలో పడినట్టు సమాచారం. ఇక అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు పీజీ చేశారు. ఐదేళ్లపాటు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేశారు. 2020లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందారు.

చేతులు కలిపిన ఉద్దండులు!

... 5వ పేజీ తరువాయి

హాస్యాస్పదంగా ఉందని పరోక్షంగా మంత్రి అమర్‌నాథ్‌ను విమర్శించారు. అమర్‌నాథ్‌ను తన గుండెల్లో పెట్టుకుంటానని ముఖ్యమంత్రి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, గతంలో తన కుమారుడు రత్నాకర్‌ను కూడా అదేవిధంగా గుండెల్లో పెట్టుకుంటానన్నారన్నారు. కొణతాల విజయానికి కలిసికట్టుగా పనిచేసి, రాక్షస పాలనను తరిమికొడదామన్నారు.

స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేసుకుందాం: కొణతాల

జనసేన, టీడీపీతో పాటు బీజేపీ కూడా పొత్తులోకి వస్తున్నందున అందరం కలిసి పనిచేద్దామని కొణతాల రామకృష్ణ అన్నారు. దాడి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఒక సమావేశం ఏర్పాటుచేసి స్టీరింగ్ కమిటీ నియమించుకుందామన్నారు. ఆ కమిటీ ద్వారా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జైలులో పెట్టడం శోచనీయమన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు మంజూరుచేసినా వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అన్యాయాలను ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలే ఎండగడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయమే లక్ష్యంగా పనిచేసి రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పడాలని, యువతకు ఉద్యోగావకాశాలు లభించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాడి తనయుడు ప్రభాకర్, కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, బొడ్డేడ శంకరరావు, బొడ్డపాటి చినరాజారావు, కోటిపల్లి జేజిబాబు, కొణతాల రమణబాబు, కృష్ణఅప్పారావు, పీలా నాగశ్రీను, మళ్ల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

బొర్రా గుహలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

నిలుపుదల చేయడానికి తగిన స్థలం లేదు.

స్వదేశీ దర్శన్‌తో మహర్దశ

స్వదేశీ దర్శన్‌లో భాగంగా బొర్రా గుహలు, చుట్టుపక్కల ప్రదేశాలను అభివృద్ధి చేయనున్నారు. గుహల్లో మరిన్ని లైట్లు ఏర్పాటు చేస్తారు. టికెట్‌లు తీసుకోవడం, క్యూలైన్‌లో వెళ్లడం వంటి వాటిని మరింత సౌకర్యవంతంగా ఉండేలా చేస్తారు. రైల్వేస్టేషన్ నుంచి గుహలు వరకు రహదారిని అభివృద్ధి చేస్తారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతారు. గేటువలస జంక్షన్ నుంచి గుహలకు వచ్చే మార్గంలో హోటళ్ల జంక్షన్ వద్ద రోడ్డును విస్తరించి, గెడ్డపై వంతెన నిర్మిస్తారు. గుహల లోపల ఇరుకుగా వున్న ప్రదేశంలో సహజ వనరులు దెబ్బతినకుండా ప్రత్యామాయ నడకమార్గాన్ని ఏర్పాటు చేస్తారు. ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

సంక్షిప్తంగా..

ఉర్లమెట్టలో శిశువు మృతి

- ఆగని శిశు మరణాలు

జి.మాడుగుల, మార్చి 8: మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ ఉర్లమెట్ట గ్రామానికి చెందిన కుర్రి ప్రశాంత్, కుమారికి పుట్టిన మూడు నెలల మగ శిశువు గురువారం మృతి చెందింది. శిశువు అనారోగ్యం చేయడంతో పాడేరు పీహెచ్‌సీలో చేర్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కాగా, మండలంలో శిశు మరణాలు తగ్గడంలేదు. గత నెల 14న లువ్వాసింగి పంచాయతీ చుట్టుగుమ్మి గ్రామానికి చెందిన ఇంతింగి రాజారావు, సావిత్రి దంపతులకు పుట్టిన మూడు నెలల ఆడ శిశువు మృతిచెందగా, మరుసటి రోజు 15న నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామానికి చెందిన తల్లె లక్ష్మణ్‌రావు, సత్యవతికి పుట్టిన ఐదు నెలల ఆడ శిశువు మృతి చెందిన విషయం తెలిసిందే. శిశు మరణాలపై వైద్యాధికారి శశికాంత్‌ని వివరణ కోరగా, తల్లులు అవగాహన లోపంతో పడుకుని శిశువులకు పాలు పెట్టడం వల్ల కొన్ని అనార్థాలకు దారి తీస్తున్నాయని చెప్పారు. అలాగే పసర మందులు, నాటు వైద్యం అందించడంతో వల్ల వ్యాధి ముదిరుతుందని, వైద్యులను సంప్రదించడం వల్ల అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందుతున్నారని వివరణ ఇచ్చారు.

లీఫ్ ఫర్ వర్డులో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

గూడెంకొత్తవీధి, మార్చి 8: లీఫ్ ఫర్ వర్డు కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని చాపరాతిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్టు హెచ్ఎం సీదరి కల్యాణం తెలిపారు. పాడేరులో జరిగిన జిల్లా స్థాయి లీఫ్ ఫర్ వర్డు పోటీలకు పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు పాల్గొన్నారన్నారు. వీరిలో మూడో తరగతి విద్యార్థిని రాటా ద్రాక్షవల్లి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ నెల 14న విజయవాడలో జరిగే పోటీల్లో ద్రాక్షవల్లి పాల్గొంటుందని ఆయన చెప్పారు.

11న మండల సర్వసభ్య సమావేశం

పాడేరు రూరల్, మార్చి 8: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.సాయినవీన్ తెలిపారు. సమావేశం అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఎంపీడీవో కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. అలాగే గ్రామ పంచాయతీల 15వ ఆర్థిక సంఘం నిధులతో పాఠశాల విద్యార్థులకు కొనుగోలు చేసిన బెంచీలను పాఠశాలల యాజమాన్యాలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ముంచంగిపుట్టు, మార్చి 8: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికలు, బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. జర్రెల సర్పంచ్ బి.భాగ్యవతి సొంత నిధులు వెచ్చించి సుమారు 164 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, స్టడీ మెటీరియల్‌ను అందించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం తన వద్దకు వస్తే సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుంగాపుట్టు సర్పంచ్ నోబియా, భాగ్యవతి సేవా సంఘం సభ్యులు సురేష్, పూర్ణ, రవకుమార్, మోహన్, కామేష్, పూర్ణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చింతపల్లి, మార్చి 8: గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కేబీ ఫౌండేషన్ ఛైర్మన్ కొక్కుల కన్నబాబు అన్నారు. లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలో శుక్రవారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళల హక్కులు, చట్టాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సలహాదారులు తలారీ జానకిరావు, జిల్లా సమన్వయకర్త నాగేశ్వరరావు, బాలసదనం వార్డెన్ వసంతకుమారి పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

ముంచంగిపుట్టు, మార్చి 8: గిరిజన స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని, జీవో నంబర్-3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న ఆదివాసీ సంఘాలు తలపెట్టిన మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని గిరిజన సంఘం మండల నాయకులు ఎం.ఎం.శ్రీను, కె.డొంబ్రూ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం కరపత్రాలను పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతీ ఒక్కరూ ఖండించాలని వారు కోరారు. బంద్‌కు అన్ని వర్గాల వారు తమవంతు మద్దతు తెలపాలని విన్నవించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చింతపల్లి, మార్చి 8: మండలంలోని కొమ్మంగి పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం కోటి లింగేశ్వరస్వామి జాతర పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన యువతీ, యువకులు 80 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కుడుముల శేఖర్, గసాడి మల్లేశ్వరరావు, చల్లంగి రవి, హెచ్‌డబ్ల్యూవో గసాడి తిరుపతిరావు, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి చెందిన మొబైల్ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులు కాలరాస్తున్న వైసీపీ

... 5వ పేజీ తరువాయి

ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించకుండా, గిరిజన యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ ఆదివాసీల బతుకులను నాశనం చేస్తున్నదని ధ్వజమెత్తారు. గిరిజన ప్రత్యేక డీఎస్సీని ప్రకటించకుండా సాధారణ డీఎస్సీ ద్వారానే గిరిజన ప్రాంతంలో పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడడంతో జిల్లాలోని గిరిజనులకు ఏడు పోస్టులు మాత్రమే దక్కుతాయని అన్నారు. జీవో-3 పునరద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని ఆరోపించారు. గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, మాతృభాష వలంటీర్లను రెన్యువల్ చేయాలని, అర్హులైన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు జారీ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు పి.అప్పలనర్స, కిల్లో సురేంద్ర అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు, జి.చినబాబు, సుంకరమెట్ట సర్పంచ్ ఎస్‌బీ. పోతురాజు, స్థానిక నేతలు ఎల్.సుందరరావు, కె.రామారావు, కె.త్రినాథ్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.